హైదరాబాద్ వార్త



# సంస్కృతి కళలే దేశ సంపద

**తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా**



కళా గురువులను అవార్డులతో సత్కరిస్తున్న దామోదర్‌గుప్తా, రమణారావు, దైవజ్ఞశర్మ

రవీంద్రభారతి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : మన సంస్కృతి, శాస్త్రీయ సంప్రదాయ కళలే దేశానికి, యావత్ భారతజాతిని నిజమైన తరగని సంపదని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. చిన్నారులను మొదలుకొని యువ, నిష్ణాత కళాకారులు, కళా గురువులకు వేదికలను అందించి అలాంటి కళలను కేవలం ఉభయ తెలుగురాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా జాతీయస్థాయిలో గత దశాబ్దంగా పోషించి ప్రోత్సహిస్తూ కళల విశ్వవ్యాప్తికి తమవంతు కృషిచేస్తూ ప్రపంచ రికార్డులను సైతం కైవసం చేసుకొంటున్న భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబిసి ఫౌండేషన్ కళాసేవ అనితరసాధ్యం, హర్షదాయకమని ఆయన సంస్థల అధినే తలు లయన్ కె.వి.రమణారావు, లయన్ లలితారావులను వారి బృందాన్ని అభినందదిస్తూ దశమ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు. భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు లయన్ కెవి.రమణారావు సభాధ్యక్షతన, లయన్ లలితారావు నిర్వహణలో జరిగిన సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోలేటి దామోదర్‌గుప్తా విశిష్ట అతిథులు శివారెడ్డి, దైవజ్ఞశర్మ, చకిలం స్వప్న, షేక్ ఫరీద్‌బాబా, కదిరి వరుణ్, ఎం.వ సుధ, విష్ణుతేజతో కలిసి నాట్యగురువులు నాగరాజు, రమాదేవి, నాగసుధ, రచ్చనరేష్, తులసి, కవిత, శృతి, సతీష్, ప్రసాద్ గురువులను ఘనంగా సత్కరించారు.

## ప్రశాంతంగా ఎస్‌ఐ పరీక్షలు



ఏవీ కళాశాల ప్రాంగణంలో పోలీసుల బందోబస్తు

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: తెలంగాణలో ఎస్‌ఐ ఉద్యోగ నియామకాలకు సంబంధించి తుది విడత రాత పరీక్షలు చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో పరీక్షా కేంద్రం అయిన దోమలగూడ ఏవీ కళాశాలలో ప్రశాంతంగా ఆదివారం జరిగాయి. చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ యాదగిరి పర్యవేక్షణలో స్థానిక సిఐ ఎన్.సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రంలో మొత్తంలో 996 అభ్యర్థులు పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా 28మంది పరీక్షలకు గైర్హాజరు కాగా దీంతో 968 మంది పరీక్షలను రాశారు. ఎస్‌ఐ(సివిల్), ఎస్‌ఐ(ఐటి), ఎస్‌ఐ(పీటిఓ), ఏఎస్‌ఐ(ఫింగర్ ప్రింట్) విభాగంలో 4 పేపర్లకు పోలీసు నియామకమండలి పరీక్షలను నిర్వహించింది. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు సిఐ సంజయ్‌కుమార్ మీడియాకు వివరించారు.

## సమాజంలోని వాస్తవాలకు అద్దంపట్టిన 'చెప్పుకుందాం రా' పద్యశతకం

**డిప్యూటీ కలెక్టర్ వనమాల చంద్రశేఖర్**



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, ఉమామహేశ్వర్, నాగభూషణం

రవీంద్రభారతి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : ప్రముఖ రచయిత ఆకారం మఠం నాగభూషణం రచించిన కందపద్య అర్ధశతకం సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులకు అద్దంపట్టేలా ఎంతో అద్భుతంగా తనదైన ప్రత్యేకశైలిలో రచించారని తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో జంగమ స్వయంసేవా సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశంలోని జరిగిన పుస్తకావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వనమాల చంద్రశేఖర్ శివశంకర్, జగదీశ్వర్, ఎం.శివకుమార్, ఉమామహేశ్వర, పద్మనాభం, రామకృష్ణ, వి.శరత్‌చంద్ర, ప్రచురణ ప్రదాత జె.నాగలింగయ్య, పుస్తక రచయిత ఆకారం మఠం నాగభూషణం తదితరులతో చెప్పుకుందాం రా తదితరులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తూ అన్నారు. ఆధునిక సాంకేతికయుగంలో ఎటుపోతోందో తెలియని నేటి సమాజంలో ప్రతిఒక్కరికీ ఎంతో సులువు అర్ధమయ్యేరీతిలో మానవతా విలువల ప్రాముఖ్యత గురించి సరళమైన భాషలో ఆయన రచనలున్నాయని, భవిష్యత్తులో మరిన్ని సమాజహిత రచనలు రావాలని ఆకాంక్షించారు. అనంతరం ఇతర అతిథులు ప్రసంగించారు.

## ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాన్ని సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ముషీరాబాద్ నియోజకవర్గం వైఎస్ఆర్‌సిపి కోఆర్డినేటర్ ఆకుల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం సమయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నేతలంతా ఉపక్రమించగా చిక్కడపల్లి పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వాదం చెలరేగడంతో పోలీసులు వారందరిని చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

# డేంజర్ రైడ్

**రోడ్లపై అరుపులు..**

బైకులపై నగరంలో కుర్రకారు హల్‌చల్

రోడ్లపై హడలెత్తిస్తున్న మైనర్ బైక్ రైడర్లు

ప్రాణాంతక విన్యాసాలతో స్టంట్లు.. భయాందోళనలో ప్రజలు



హైదరాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : సైలెన్సర్ లేకుండా రయ్ రయ్.. ఫట్ ఫట్ మంటూ దడ పెట్టించే పెద్ద పెద్ద శబ్దాలు..ఒక్క బైక్‌పైనే ముగ్గురు నలుగురు కూర్చొని స్పీడ్ డ్రైవ్‌లు..పిచ్చి పిచ్చి అరుపులు..కేకలతో భయానక రైడ్‌లతో కుర్రకారు నగరంలో హోరెత్తిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై కొందరు ఆకతాయిలు చేసే ప్రమాదకర స్టంట్లతో మిగతా వాహనచోదకులు హడలెత్తిపోతున్నారు. బైక్ రేస్‌లతో పక్క నుంచే అతివేగతంగా దూసుకెళ్తూ భయాందోళనకు గురిచేస్తున్నారు. మరికొందరైతే పోలీసులు గుర్తించకుండా నెంబర్ ప్లేట్ లేని బైక్‌లపై వెళ్తుండడం నిత్యకృత్యమైంది. తమ పిల్లలను అదుపులో పెట్టకుండా తల్లిదండ్రులు గారాబం చేయడంతో ఇంకా రెచ్చిపోతున్నారు.కొందరు ఆకతాయిలు బైక్‌లపై విన్యాసాలు, సర్కస్ ఫీట్లు చేస్తూ పక్కన వెళ్లేవారిని పరేషాన్ చేస్తున్నారు. మలక్‌పేట్ చంచల్‌గూడలో కొందరు ఆకతాయిలు బైక్ రేసులతో రెచ్చిపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్లపై ప్రమాదకరమైన స్టంట్లు చేస్తున్నారు. రోడ్లపై 100 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతున్నారు. సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు ఫీట్లు చేస్తూ..ఇతరుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. యువకుల చేష్టలతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ చర్యలను కట్టడి చేయాల్సిన ట్రాఫిక్ పోలీసులు కేవలం చలాన్లకే పరిమితమవుతున్నారు.

ఇద్దరు వెళ్లాల్సిన బైక్‌లపై ముగ్గురు, నలుగురు కూర్చొని ప్రయాణిస్తుండడం ఇటీవల పరిపాటిగా మారింది. ప్రమాదమని తెలిసినా పట్టించుకోవడంలేదు. ఇప్పుడదే ఫ్యాషన్‌గా మారింది. ఔటర్ రింగ్‌రోడ్, నెక్లెస్ రోడ్డు, బంజారాహిల్స్, గచ్చిబౌలి తదితర విశాలమైన ప్రదేశాల్లో నైట్ రైడింగ్, నైట్ రేసింగ్, స్టంట్ రైడింగ్, వీలింగ్, స్టీపీ, బర్న్ ఔట్, హై చేర్, రోలింగ్ స్టాఫీ వంటి విన్యాసాలు చేస్తున్నారు. వీరిని అదుపు చేయాల్సిన పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. హైస్పీడ్ స్పోర్ట్స్ బైక్‌లు కొనిచ్చిన తల్లిదండ్రులకు తమ పిల్లల బైక్ విన్యాసాలపై దృష్టి సారించడం లేదు. దీంతో ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. బైక్ రైడర్లలో లైసెన్సు లేని వారి సంఖ్య 50 శాతానికిపైగా ఉంటుందని తెలిసి కూడా పోలీసులు,ఆర్టీఎ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. గ్రేటర్‌లో ఉదయం ఐదు గంటలకు మొదలు కొని రాత్రి 11 గంటల వరకు రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఇతర ప్రాంతాల నుండి, నగర శివారు ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి వెళ్తుంటారు. ఆర్టీసి బస్సులు, కార్లు, ఆటోలు, ప్రైవేటు వాహనాలతో బిజీబిజీగా ఉండే రోడ్లపై యువత చేసే బైక్ విన్యాసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ట్రాఫిక్ సిగ్నళ్లను సైతం లెక్కచేయకుండా రయ్.. రయ్ మంటూ దుసుకెళ్తున్నారు.బైక్‌లపై అతివేగంగా ప్రయాణించేవారిని పట్టుకునేందుకు గతంలో ప్రత్యేక బృందాలు కనిపించకుండా పోయాయి. ఛేజింగ్ చేస్తున్న సమయంలో రైడర్లు ప్రమాదానికి గురైతే తామే బాధ్యులమవుతామని పోలీసులు కూడా ఒక్కోసారి వదిలేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌కు పరిమితం కాకుండా యువత స్పీడుకు కళ్లెం వేయాల్సి ఉంది. బైక్ రైడర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాలకు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిపై బిజెపి, కాంగ్రెస్ పార్టీ నేతలు సిద్ధమా?



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్న గెలువయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన అభివృద్ధిపై బిజెపి, కాంగ్రెస్ పార్టీల నేతలు చర్చకు సిద్ధమా ? అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సవాల్ విసిరారు. ఆదివారం అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక డివిజన్ బిఆర్ఎస్ ఆత్మీయ సమావేశం మహారాణ ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సహకరించడం లేదని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రం ఎమి అభివృద్ధి చేస్తానంటే రాష్ట్రం ఎక్కడ అడ్డుకున్నదో చెప్పాలని డిమాండ్ చేశారు. 15 సంవత్సరాలుపాటు అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యేగా పనిచేసి, 4 సంత్సరాలుగా కేంద్ర మంత్రిగా పనిచేస్తున్న జి.కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ నియోజకవర్గానికి ఎం చేశారో చెప్పగలరా అని ఆయన ప్రశ్నించారు. అంబర్‌పేట ఎమ్మెల్యేగా ఓడినందువల్లనే కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి అయ్యారని బిఆర్ఎస్‌కు కృతజ్ఞతలు చెప్పాలన్నారు. కేవలం తెలంగాణ ప్రభుత్వాన్ని తిట్టడానికే ఢిల్లీ నుంచి మోదీ హైదరాబాద్‌కు వచ్చారా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాతనే ఆనేక సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు జరుగుతున్నాయని మంత్రి తలసాని వివరించారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు గెల్వయ్య బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జీ దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# అతివేగానికి ఇద్దరు బలి

**కారు, టిప్పర్ ఢీకొన్న సంఘటనలో అక్కడికక్కడే మృతి**



ప్రమాదంలో మృతిచెందిన షేక్‌వాహబ్ యాకుబ్, షేక్ ఖుద్దుస్ (ఫైల్‌ఫోటో)

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: అతివేగంగా దూసుకువచ్చిన టిప్పర్, కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన షేక్‌వాహబ్ యాకుబ్(43), షేక్‌ఖుద్దూస్(40) అనే ఇద్దరు వ్యక్తులు చంద్రాయణ్‌గుట్టలో నివాసం ఉంటున్న తన అల్లుడు ఇమ్రాన్ ఖాన్ ఇంటికి రంజాన్ పండుగను జరపుకోవడానికి కారులో బయలు దేరారు. మేడ్చల్ నుంచి సుచిత్ర వైపు వెళ్తుండగా టీఎస్07యూహెచ్0641 నెంబర్ టిప్పర్ శనివారం అర్ధరాత్రి 2:30గంటల సమయంలో ఇండికేటర్ వేయకుండా రహదారిపైకి రావడంతో వేగంగా వచ్చిన కారు టిప్పర్ వెనక భాగంలో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ వాహద్ యాకుబ్, షేక్ ఖుద్దుస్ ఇద్దరు అక్కడికక్కడే దర్మరణం చెందారు. సమాచారం తెలుసుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.



మృతిచెందిన సుశ్వాంత్ నాయక్ (ఫైల్‌ఫోటో)

**మరో ఘటనలో ద్విచక్రవాహనదారుడు మృతి..** వేగంగా దూసుకొచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఆదివారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన భూక్యా దశరథ్ కుమారులు సుశ్వాంత్ నాయక్(22), సాయి సృజన్ ఇద్దరు మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చదు వుకుంటూ మచ్చ బొల్లారంలో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు సుశ్వాంత్ ఒక వేడుకకు హాజరై ద్విచక్రవాహనం టీఎస్19హెచ్0671పై మచ్చ బొల్లారంలోని తన ఇంటికి తిరిగి వస్తుండగా బహదూర్‌పల్లి సమీపంలో అతి వేగంగా వచ్చిన మహీంద్ర థార్ టీఎ న్66ఏఎఫ్1201 వాహనం ఢీకొట్టడంతో సుశ్వాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కేంద్రం విభజన హామీలను అమలు చేయాలి

సైఫాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హైదరాబాద్ నగరానికి వచ్చిన సందర్భంగా రాష్ట్ర విభనల హామీలపై ఏలాంటి వ్యాఖ్యాలు చేయకపోవడం అన్యాయమని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం విడిపోయి 9 సంవత్సరాలు అవుతున్నదని, పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రధాని హైదరాబాద్ వచ్చినప్పుడల్లా రాజకీయ విమర్శలు చేస్తున్నారే తప్పా విభజన హామీలపై నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజల అకాంక్షలను గుర్తించి విభజన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సూపర్‌మాక్స్ కంపెనీ కార్మికులను ఆదుకోండి

**టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఐక్య కార్మిక సంఘాల మొర**



టి.పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిపత్రం సమర్పిస్తున్న సూపర్‌మాక్స్ కార్మికులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : జీడిమెట్ల పారిశ్రామికవాడలో గల సూపర్‌మాక్స్ బ్లేడ్స్ కంపెనీ కార్మికులు గత తొమ్మిది నెలలుగా కంపెనీ మూతపడటంతో అర్థాకలితో అలమటిస్తున్నందున తక్షణ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ఆదివారం సూపర్‌మాక్స్ కంపెనీ కార్మికులు మూకుమ్మడిగా తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్ కార్యదర్శి కొలను హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నుండి రేవంత్‌రెడ్డి నివాసానికి తరలివెళ్లి తమగోడును వెల్లబోసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వస్తే పరిశ్రమలు పెరుగుతాయని, కార్మికులకు మరింత ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావిస్తే ఉన్న ఉద్యోగాలు పోయి రోడ్డునపడుతున్న కారినకులకు ప్రభుత్వమే భరోసాఇచ్చి తిరిగి ప్రభుత్వం కార్మికులకు మద్దతుగా నిలవాలని డిమాండ్‌చేశారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ కార్యాదర్శి కొలను హనుమంతరెడ్డి మాట్లాడుతూ కార్మికశాఖ కమిషర్‌తో చర్చలు జరిగి తక్షణం సూపర్‌మాక్స్ కార్మికులకు తగిన నాయంచేయాలని డిమాండ్‌చేశారు. తక్ష ణం సూపర్‌మాక్స్ కార్మికుల సంక్షేమంకోసం ప్రభుత్వం చర్యలు ప్రారంభించకపోతే లేబర్ కార్యాలయం ముందు భారీ ఆందోళనచేసి కార్యకలాపాలు స్థంబింపజేస్తామని హెచ్చరించారు. కార్యనరకమంలో కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, కార్మిక ఐక్య సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



**పోటెత్తిన ఉప్పల్ స్టేడియం**

ఉప్పల్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య ఆదివారం జరిగిన ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చిన క్రికెట్ అభిమానులు, చీర్‌గర్ల్స్ నృత్యాలు

# కార్పొరేట్ వల!

అడ్మిషన్ల కోసం అప్పుడే కళాశాలల వేట

తల్లిదండ్రులను కలుస్తున్న ఏజెంట్లు

డిజిటల్, ఇంటర్నేషనల్ విద్య పేరిట ప్రలోభాలు

ముందస్తుగా చేరిస్తే ఫీజుల్లో రాయితీలు

ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలు బేఖాతరు



హైదరాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : వచ్చే విద్యాసంవత్సరం కోసం విద్యాసంస్థల యాజమాన్యాలు అప్పుడే నూతన అడ్మిషన్ల కోసం వేట ప్రారంభించాయి. ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు జోరందుకున్నాయి. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలు బేఖాతరు చేస్తున్నాయి. నగరానికి చెందిన కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు టెన్త్ పరీక్షలు పూర్తి కాక ముందే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మీషన్ల కోసం ఏజెంట్లను రంగంలోకి దింపాయి. ఇప్పటికే కొన్ని కళాశాలలు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయగా, మరికొన్ని ప్రైవేటు కాలేజీ అడ్మిషన్లు కోసం విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్లుచేసి బంగారు భవిష్యత్తు అందిస్తామంటూ ప్రలోభాలకు గురి చేస్తున్నాయి. అడ్మిషన్ల కోసం ప్రతిభ పరీక్షలు ప్రత్యేక స్కాలర్ షిప్‌తో ఫీజులో రాయితీ ప్రకటిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థుల వివరాలు, వారి తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు సేకరించి తమ కళాశాలలో చేర్పించండి. మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రచారం చేసుకుంటున్నారు. ఒక్కసారి కాలేజీని సందర్శించంటూ పదే పదే ఫోన్లు చేయించడం మామూలుగా మారింది. ఎంసెట్, జెఇఇ, నీట్ విద్యార్థుల కోసం కళాశాలలు ఏజెంట్లను కూడా నియమించుకుని వారి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను ఫోన్లలో సంప్రదించడం, కలవడం, అడ్మిషన్లు బుక్ చేసుకోవడం లాంటి కార్యకలాపాలు ప్రారంభించాయి. తమ విద్యాసంస్థలో ముందుగా చేరితే ఫీజులో రాయితీ ఇస్తామంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. అయితే పదవ తరగతి పరీక్షలు పూర్తికాకముందే ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం వరుసగా వస్తున్న ఫోన్లు, ఎస్ఎంఎస్‌లతో తల్లిదండ్రులు విస్తుపోతున్నారు. వచ్చే విద్యాసంవత్సరం ఆడ్మిషన్లు తీసుకోవాలంటూ తల్లిదండ్రులకు అడ్మిషన్లను చేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి. అయితే ప్రతిఏటా నగరంలో వేల సంఖ్యలో విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలో చదువుకుంటుండగా.. మళ్లీ తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ కళాశాలల్లో చేర్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. అడ్మిషన్ల కోసం ప్రతిభ పరీక్షలు ప్రత్యేక స్కాలర్ షిప్‌తో ఫీజులో రాయితీ ప్రకటిస్తున్నాయి. ఒక్కసారి కాలేజీని సందర్శించండంటూ పదే పదే టెలికాలర్స్ ద్వారా ఫోన్లు చేయించడం మామూలుగా మారింది. 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నోటికేషన్ విడుదల కాకుండానే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించవద్దని ఇటీవల ఇంటర్మీడిఎట్ బోర్డు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే.

**తెలంగాణ సారస్వత పరిషత్తులో**

## బాలసాహిత్య సమ్మేళనం

నాంపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఈ నెల 24, 25 తేదీల్లో రెండురోజులపాటు బాలసాహిత్య సమ్మేళనం నిర్వహిస్తున్నారు. డా. కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి సౌజన్యంతో కోదూరి శాంతమ్మ స్మృత్యర్థం జరుగనున్న ఈ సమ్మేళనంలో ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాలకు చెందిన బాలసాహితీ వేత్తలు, బాలరచయితలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బాలవికాసం, బాలసాహిత్య వికాసం కోసం స్వచ్ఛందంగా సేవలం దిస్తున్న ప్రముఖులు ఈ సమ్మేళనంలో ప్రతినిధులుగా పాల్గొంటారు.

## 4వ వార్డు గాంధీ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా : మన్నె క్రిశాంక్



4వ వార్డు గాంధీ కాలనీలో బస్తీ నిద్రలో పాల్గొన్న మన్నె క్రిశాంక్

కంటోన్మెంట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 4వ వార్డు పికెట్ గాంధీ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసేస్తానని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ హామీ ఇచ్చారు. శనివారం రాత్రి గాంధీ కాలనీలో 3వ బస్తీనిద్ర కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ బస్తీ నిద్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. గాంధీ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడంతో పాటు జె.ఎన్.ఎన్.యు.ఆర్ఎం ఇండ్లల్లో నివాసం ఉంటున్న 160 మంది లబ్ధిదారులకు విద్యుత్ మీటర్లు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. రోజు విడిచి రోజు మంచినీరు సరఫరా అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. బస్తీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీ కట్టమైసమ్మ ఆలయ కమాన్ నిర్మాణానికి తన సొంత నిధుల నుంచి లక్షల రూపాయలను చెక్కు రూపంలో విరాళంగా అందజేశారు. కంటోన్మెంట్ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు రాజేందర్, నాయకులు ఇస్మయిల్, బి.ప్రభాకర్, కె.సాయి, డి.విజయ్, హరిబాబు, నరి ్సంగ్‌రావ్, మోని,రఘు తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు గొప్పగా జరుపుకునేందుకు ప్రభుత్వ సహకారం

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



మారేడ్‌పల్లిలో ముస్లింలకు రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: తెలంగాణ పండుగలను గొప్పగా నిర్వహించుకుంటున్న ఘనత ముఖ్య మంత్రి కేసిఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సనత్ నగర్ నియోజ కవర్గానికి చెందిన ముస్లిం మైనార్టీలకు ఆదివారం మారేడ్‌పల్లిలోని మల్టీప ర్పస్ ఫం క్షన్ హాల్‌లో రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ పండుగలను ప్రజలు ఎంతో సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్ధేశంతో పేద ముస్లింలకు నూతన దుస్తులను పంపిణీ చేస్తున్నామన్నారు. అదే విధం గా క్రిస్మస్, దసరా బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. ముస్లింలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ప్రతి ఏటా ఎల్బీస్టేడియంలో నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా మజీద్‌లు, గ్రేవ్ యార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేసినట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కురుమ హేమలత, కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, మహేశ్వరీ, మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, శేషుకుమారి, ముస్లిం మైనార్టీ నేతలు ఖలీల్, యాసిన్, ఫహీమ్, నోమద్దిన్, అష్రఫ్, అఖీల్, అబ్బాస్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్ధనలు



ప్రార్ధనలు నిర్వహిస్తున్న మహిళలు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈస్టర్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వెస్ట్‌జోన్‌లోని పలు ప్రధాన చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. క్రిస్టియన్ సోదరి, సోదరులు పెద్ద సంఖ్యలో ఈ ప్రార్ధనల్లో పాల్గొని యేసుక్రీస్తు ప్రభువు సిలువ మరణాన్ని జయించి తిరిగి లేచిన సందర్భాన్ని ధ్యానించారు. కూకట్‌పల్లిలోని భాగ్యనగర్ సెంట్రల్ చర్చ్‌లో రిజరక్షన్ డే ప్రత్యేక ప్రార్థనలు రెవరెండ్ డాక్టర్ విప్పర్తి అధ్యతన జరిగాయి. జీసస్ సిలువపై మరణించి తిరిగి విజయుడై లేవడం ద్వారా సర్వమానవాళికి ముక్తిమార్గం ఏర్పాటయిందని తెలిపారు. బీసీసీ సంఘ సభ్యులు సతీష్ మంద్రు, రత్నమయ్య, ఇంజనీర్ ప్రసాద్, మార్త పురుషోత్తం, మేరీ ఎలిజబెత్, అర్తర్ పాలిన ఎడిత్, జాలీ సామ్, జిన్నీ సామ్ తదితరలు పాల్గొన్నారు. చిన్నారుల డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చివరిగా ఆత్మీ తల్లి నిర్మలమ్మ ప్రత్యేక సందేశంతో ఈస్టర్ వేడుకల్ని ముగించారు. విధాత యేసుక్రీస్తు ప్రభువు సిలువపై సర్వ మానవ పాపపరిహారార్ధం ప్రాణత్యాగం చేసిన రోజు గుడ్‌ఫ్రైడే లేదా శుభ శుక్రవారం కాగా పునరుత్థానుడైన రోజున ఈస్టర్‌గా జరుపుకుంటామని డాక్టర్ విప్పర్తి తెలిపారు. చివరిగా ప్రేమ విందులో సభ్యులంతా పాల్గొన్నారు.

## నగరానికే తలమానికంగా రంగానగర్ కాలనీ ఐలవ్ ఆర్ఎన్‌జిఆర్



రంగానగర్ కాలనీ ఐకాన్‌గా నిలిచిన ఐలవ్ ఆర్ఎన్‌జిఆర్ మోడల్‌ను ప్రారంభిస్తున్న తంగా లక్ష్మారెడ్డి, బండారు వరప్రసాద్‌గుప్తా

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కే చింతల్ డివిజన్‌లోని ఐలవ్ ఆర్ఎన్‌జిఆర్ పేరు తలమానికమని కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రంగానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన ఐ లవ్ ఆర్ఎన్‌జిఆర్ అనే కొత్తతరం లవ్‌సింబల్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా రంగానగర్ కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్‌గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత కాలనీ బస్తీ పరిశుభ్రత, పచ్చదనంతో తమ సత్తాచాటుతూ ప్రభుత్వానికి కాలనీ వాసులకు ప్రత్యేక గుర్తింపుగా మారాలని సూచించారు. తానెప్పుడూ రంగానగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక గుర్తింపు విధానాన్ని చూడలేదని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికే రంగానగర్ కాలనీ చూసి ఆదేబాటలో నడవాలని సూచించారు. రంగానగర్ సంక్షేమసంఘు అధ్యక్షులు బండారు వరప్రసాద్ మాట్లాడుతూ ఇదంతా కాలనీ వాసులందరి సహయ, సహకారాలు, ప్రోత్సాహంతోనే ఏర్పాటు చేయడం సాధ్యమైందన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అభివృద్ధి కోసం కృషి

**కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి**



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రేమావతి పేట్,భువనేశ్వరీ కాలనీ ప్రజల సౌకర్యార్ధం సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోర్,వాటర్ ట్యాంక్‌ను ఆదివారం డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సమస్యలను శాశ్వత పరిష్కారానికి అన్ని విధాల పాటు పడుతున్నానని తెలిపారు. సురేష్ ముదిరాష్, రఘు ముదిరాజ్,భవానీ దాస్,నారోత్తం రెడ్డి, మోహన్,టి.చిన్న, బబ్లూ, మురళీ సాగర్, తిరుపతమ్మ, చిరంజీవి,రాజు,బిక్షపతి,వెంకటేష్,పద్మ, సురేష్,విజయ్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## బిఆర్ అంబేడ్కర్‌కు జ్ఞానమాల

అల్వాల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేసే కార్యక్రమం ఆదివారం జరిగింది. లోతుకుంటలోని అంబేడ్కర్ విగ్రహానికి బొల్లారం పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ జ్ఞాన మాలను వేశారు. ప్రతి ఆదివారం అంబేడ్కర్‌ను స్మరించుకుని గౌరవించుకోవడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర నూతన సచివాలయం వద్ద 125 అడుగులు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయనున్న నేపధ్యంలో సీఎం కెసిఆర్‌కు పలువురు వక్తలు ధన్యవాదాలు చెప్పారు. సీనియర్ జర్నలిస్టు ఆశ శ్రీరాములు ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జగదీష్ సిఎల్ యాదగిరి కెడి రమేష్ అశిష్ కళావతి కన్నయ్య ఓం ప్రకాష్ పటోళ్ళ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మరకత లక్ష్మీ గణపతి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అల్వాల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: కానాజీగుడా మరకత లక్ష్మీ గణపతి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపకులు మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు. బ్రహ్మోత్సవాలు మొదటి రోజు స్వామి వారికి సుప్రభాత సేవ విశేష అభిషేకం కలశ స్థాపన చేశారు. ప్రత్యేక హోమాలు నిర్వహించడం జరిగింది. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సత్యనారాయణ శాస్త్రి కోరారు.

## చలి వేంద్రం ప్రారంభం



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న కె.పి.విశాల్‌గౌడ్

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్9 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో అగాపే ప్రేయర్ హౌస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని యువ నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.పి.విశాల్ గౌడ్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర భంగా కె.పి.విశాల్‌గౌడ్ మాట్లాడుతూ వేసవి కాలంలో బాటసారుల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన అగాపే ఫౌండేషన్ వారిని అభినందించారు.పేద ప్రజలకు మేలు చేసేందుకు తన వంతుసహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌రెడ్డి, వెంకటేష్, నాని, మణి, సతీష్ పాల్గొన్నారు.

## హిందూ హృదయ సామ్రాట్ ఆలె నరేంద్ర



నివాళులు అర్పిస్తున్న బోనం ఊర్మిళ, రచ్చ శ్రీనివాస్, బోనం

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: హిందూ హృదయ సామ్రాట్, తెలంగాణ ప్రజల గుండెల్లో కొలువైన వ్యక్తి మాజీ కేంద్రమంత్రి, టైగర్ ఆలె నరేంద్ర అని బీసీ, ఎస్సీ,ఎస్టీ చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బోనం ఊర్మిళ అన్నారు. ఆదివారం టైగర్ నరేంద్ర వర్దంతి సభ గాంధీనగర్‌లోని ఆంద్రాకేఫ్ చౌరస్తా వద్ద, పద్మశాలి సంఘం గాంధీనగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిందది. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్, వెంకటేశ్, కెప్టెన్ శ్రీనివాస్, బోనం బన్నీ, రఘునాథ్, సత్యనారాయణ, ఏనుగుల అనీల్ తదితరులు పాల్గొన్నారు. అణగారినవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి నరేంద్ర అని అన్నారు.

### విఖ్యాత పద్మశ్రీ శోభానాయుడు జయంత్యుత్సవాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: విఖ్యాత కూచిపూడి నాట్యగురువు పద్మశ్రీ డాక్టర్ శోభానాయుడు జయంత్యుత్సవ్ కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో 13, 14 తేదీలలో నిర్వహించబోతున్నట్లు ఆమె శిష్యబృందం సభ్యులు తెలిపారు. డాక్టర్ శోభానాయుడు నాలుగు దశాబ్దాలకుపైగా వందల మందిని కూచిపూడి నాట్యకళలో శిక్షణ ఇచ్చారు. వారి శిష్యులు దేశవిదేశాల్లో స్థిరపడి నాట్యకళను వ్యాప్తి చేస్తున్నారు. శిష్యప్రతిష్య సంప్రదాయంగా వారి నాట్య ప్రదర్శన రెండు రోజుల పాటు జరుగుతాయి. తొలి రోజు ముఖ్యఅతిథిగా నాట్య గురువు పదమజారెడ్డి పాల్గొని మృదంగ కళాకారుడు పిఆర్‌సి.శర్మను సత్కరిస్తారు. నాట్యశాఖ ఆచార్యులు డాక్టర్ జొన్నలగడ్డ అనూరాధ పాల్గొంటారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ కిట్లను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ



రంజాన్ కానుకులను పంపిణీ చేస్తున్న గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : రంజాన్ మాసం పర్వ దినాన్ని పురస్కరించుకుని వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీలో గల మసీదులో జగిరిన బట్టల పంపిణీ కార్యక్రమంలో హైదరనగర్ డివిజన్ కార్పోరేటర్ నార్నె శ్రీనివాస్ రావు, మాజీ కార్పోరేటర్ మాధవరం రంగారావులతో కలిసి ముస్లిం సోదర సోదరీమణులకు ఆదివారం ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని, రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ, ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులకు పండగను ధనిక, పేద బేధం లేకుండా సుఖసంతోషాలతో జరుపుకునేందుకు వీలుగా ముఖ్యమంత్రి కెసిఆర్ పెద్ద మనసుతో బట్టలు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. తెలంగాణకు ప్రత్యేకమైన గంగా జమునా తెహజీబ్ మరింతగా పరిఢవిల్లాలని, రంజాన్ పండుగ ప్రజా జీవితాల్లో సుఖ సంతోషాలను అందించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్, హరినాథ్, ఆంజనేయులు, బాబురావు, శ్రావణిరెడ్డి, లింగయ్య, కృష్ణ, ప్రవీణ్, రాధాభాయ్, భాస్కర్, ఇస్మాయిల్, యూసుఫ్, జహంగీర్, చంద్రయ్య, వెంకన్న, బాబు, నరసింహా, అంజయ్య, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న బీజేపి నాయకులు

## ఇంటింటి బిజెపి కార్యక్రమం ప్రారంభం

జీడిమెట్ల, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని కైసర్‌నగర్ బస్తీలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటికి ఓబీసీ, గడప గడపకి బీజేపి కార్యక్రమాన్ని డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు పత్తిరఘుబాబు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్.మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఓబీసి మోర్చా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలు ప్రజలకు తెలిపే విధంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు శ్రీనివాసరావు, బాలకృష్ణ, శేఖర్, గోపాల్ పాల్గొన్నారు.

### బాచుపల్లిలో సీపీఐ మండల సమితి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు

నిజాంపేట్, ఏప్రిల్9 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధి సీపీఐ మండల సమితి సమావేశం ఇంద్రన్న కాలనీలో ఆశీయాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ నాయకుల పిలుపు మేరకు బీజేపి హఠావో దేశ్‌కు బచావో కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఇంటింటికి సీపీఐ నినాదంతో అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14వ తేదీన ప్రారంభిస్తామన్నారు. మే 14న ముగింపు సభను లక్ష మందితో పెద్ద ఎత్తున కొత్త గూడెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా బాచుపల్లి మండలంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎన్.కరుణాకర్ రెడ్డి, మల్లయ్య, డిల్లేశ్వర్‌రావు, సింధూరి, శివకుమార్, వరుణ్ పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం



బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్, దీపాంకర్ పాల్

చార్మినార్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని హైదరాబాద్ పార్లమెంట్ నియోజ కవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్ అన్నారు. సీనియర్ బిఆర్ఎస్ నాయకులు,మాజీ ఘాన్సీ బజార్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు దీపాంకర్ పాల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘాన్సీ బజార్‌లోని గాయత్రీ భవనంలో జరిగిన బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా పుస్తె శ్రీ కాంత్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాలలోను ఎంతగానో అభివృద్ధి చెందిందని తెలిపారు.సీనియర్ బిఆర్ఎస్ నాయకులు,మాజీ ఘాన్సీ బజార్ డివిజన్ అధ్యక్షులు దీపాంకర్‌పాల్ మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని అనేక రాష్ట్రాలు కీర్తిస్తూ తమ రాష్ట్రాలలో అమలు చేసేందుకు పథక రచన చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని ఆయన తెలియజేశారు.ప్రభుత్వ పథకాలను ప్రజలు అన్ని విధాల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఘాన్సీ బజార్‌లో జరిగిన బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావటంతో నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఘాన్సీ బజార్‌లో బిఆర్ఎస్ బలోపేతం కోసం అందరం కలిసి కట్టుగా పాటు పడదామని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మనీష్ అగర్వాల్, సునీల్ అగర్వాల్,పెంద్యాల లక్ష్మణరావు,గోపీగౌడ్‌తో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు,బెంగాల్ సమాజ్‌కు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆరోగ్యమిత్రలను స్కిల్డ్ ఎంప్లాయిస్‌గా గుర్తించి

## కనీస వేతనంగా రూ.28వేల నిర్ణయించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ ప్రభాతవార్త: ఆరోగ్యమిత్రలను స్కిల్డ్ ఎంప్లాయిస్‌గా గుర్తించి కనీస వేతనంగా రూ.28వేలతో వెంటనే క్యాడర్ మార్పు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యమిత్ర రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గిరియాదయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పలు డిమాండ్లను ఆమోదించారు. కనీసవేతనాన్ని రూ.28వేలతో పాటు టిఏ, డిఏ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగభద్రత కల్పించి, షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలని, పిహెచ్‌సి, ఆరోగ్యమిత్రలను తిరిగి పిహెచ్‌సిలోనే విధులు నిర్వహించేలా ఆదేశాలివ్వాలని, విధి నిర్వహణలో మరణించిన మిత్రలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జింఖానా గ్రౌండ్‌లో భారతదేశపు చేతి పనులు, వంటకాలు, సంస్కృతి వేడుక

బేగంపేట ఏప్రిల్ 9,ప్రభాతవార్త : దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలతో పాటు వివిధ దేశాల సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన ఉత్పత్తులకు సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ వేదిక కానుంది. సున్నితమైన స్వదేశీ తయారీ ఉత్పత్తులలో అప్లిక్ వర్క్,డ్రైఫ్లవర్స్, జ్యూటకేన్, బ్రాస్ ఉత్పత్తులు, ఉడెన్, క్లేటాయ్స్, అర్జక్ బ్లాక్ ప్రింట్,బ్లూప్రింట్ పాటరీ,పాష్మినాషాల్,లక్కగాజులు,రాజస్తానీ ఆభరణాలు,పుల్కారీ లెదర్ ఉత్పత్తులు, పాటరీ, జ్యూట్ ఉత్పత్తుల వంటివి వీరు విక్రయిస్తారన్నారు. ద-మలాంగ్ హ్యునర్ మహోత్సవ్‌ను సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో సోమవారం సాయంత్రం 6గంటల నుంచి అందు బాటులోకి తేనున్నట్లు మలాంగియా ఆర్ట్స్ మేనేజింగ్ డైరక్టర్ రిషీకుమార్ ఝూ తెలియజేసారు. ఆదివారం సాయంత్రం జింఖానా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.హ్యునర్ మహోత్సవ్‌లో 250 మందికి పైగా కళాకారులు,చేతి పనివాళ్లు 20 కి పైగా దేశాలు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు అస్సాం,బీహార్,ఢిల్లీ, గోవా, గుజరాత్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ అండ్ కాశ్మీర్,జార్ఖాండ్, కర్నాటక, మధ్యప్రదేశ్,మణిపూర్,ఒడిషా,పుదుచ్చేరి,పంజాబ్,రాజస్థాన్,ఉత్తరప్రదేశ్,ఉత్తరాఖండ్,పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన వారు తమ సున్నితమైన దేశీయ హ్యాండ్‌మేడ్ ఉత్పత్తులను ఈ మహోత్సవ్‌లో విక్రయించనున్నారని తెలిపారు.

### సైకాలజిస్టులు తమ సత్తా చాటాలి: రాంచందర్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మోతుకూరి రాంచందర్

సైఫాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: సంఘం నాయకత్వాన్ని మరింతగా మెరుగుపరుచుకుని సమాజానికి చెరువు కావాల్సిన అవసరం ఉందని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ సైకాలజిస్టులకు పిలుపునిచ్చారు. ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన రంగారెడ్డి, మెడ్చల్ జిల్లాల సైకాలజిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సైకాలజిస్టులు తమ సత్తాను చాటాల్సిన అవశ్యకత ఉందని, నైపుణ్యాన్ని పెంపొందించుకొని సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి ముందుండాలని పిలుపునిచ్చారు. సంఘటితంగా పోరాటం చేసినట్లయితే సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటవుతుందన్నారు. ప్రతి సైకాలజిస్ట్ నాయకత్వ లక్షణాలతో ఒక శక్తిగా ఎదిగాలని ఇందుకుగాను సంఘానికి దిన చర్యలో భాగంగా కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. ఇది మీ ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. సమాజంలో పెట్రేగిపోతున్న విపరీత దోరణులపై వెంటనే ప్రతి సైకాలజిస్ట్ స్పందించాలని సూచించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వై.శివరామప్రసాద్, కార్యదర్శిగా దేదీప్య, మేడ్చేల్ జిల్లా అధ్యక్షుడిగా అలియ పర్వీన్, కార్యదర్శిగా రాజు ఆచార్యలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## హానుమాన్ నగర్‌లో సహపంక్తి భోజనం



సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యనగర్ జిల్లా బిజెపి నాయకులు

చార్మినార్,ఏప్రిల్ 9 ప్రభాతవార్త : భారతీయ జనతా యువమోర్చ సేవా సామాజిక న్యాయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం భాగ్యనగర్ జిల్లా బిజెవైఎం అధ్యక్షులు శివచ ంద్ర గిరి ఆధ్వర యంలో గౌలిపుర డివిజన్‌లోని హనుమాన్‌నగర్ బస్తీలో సహపంక్తి భోజనం కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు ఎస్.సురేందర్‌రెడ్డి, గౌలిపుర డివిజన్ కార్పొరేటర్ అలె.భాగ్యలక్ష్మీ,ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్, అధికార ప్రతినిధి వీరేందర్ యాదవ్,యాకుత్‌పుర నియోజకవర్గం బిజెపి కన్వీనర్ ధీరజ్, డివిజన్ అధ్యక్షులు రఘుకాంత్, యువమోర్చ ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్,జగన్ మోహన్,యువమోర్చ నాయకులు సచిన్,మహేష్,దీపక్,మహిళా మోర్చ నాయకులు రేణుక,నళిని, అనితతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అణగారినవర్గాల సేవలకు గుర్తింపు వివేక్‌కు దళితసేవారత్న పురస్కారం

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: భారత మాజీ ఉపప్రధానమంత్రి బాబూజగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రముఖ సంఘసేవకులు రూపుల వివేకానంద్‌కు ఉత్సవ కమిటీ ద్వారా 'దళిత సేవారత్న' పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని బిఆర్ఎస్ రాష్ట్ర నేత, విఎస్టీ వర్కర్స్‌యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం దళితసేవారత్న పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా చిక్కడపల్లిలో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు బుజ్జి వెంకటేశ్వరన్న, నేతా శ్రీనివాస్, రేషం మల్లేష్, సిరిగిరి శ్యామ్, సిరిగిరి కిరణ్, పున్నం ప్రవీణ్, కార్తీక్‌యాదవ్, రవియాదవ్, సత్యనారాయణ, సద్దిక్, అమిత్, ఇయాజ్, అజ్జు, సాయియాదవ్, దీపు, సాయి, లడ్డు తదితరులు పాల్గొన్నారు. పురస్కారాలు ప్రోత్సాహాన్ని అందిస్తాయని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు వివేక్ చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందుకోవడం విశేషమన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

### నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలుపరచకుండా చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్సీ ఏ నర్సిరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ధర్నాచౌక్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: ఉద్యోగ, ఉపాధ్యాయ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దోమలగూడలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.జంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం 2020 పేరుతో పాఠశాలలో విద్యార్థుల నమోదును 6 సంవత్సరాలు నిండిన తరువాతనే చేర్చుకోవాలనే నిబంధన పెట్టటం అంటే విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల వైపు మళ్లించటానికేనని ఆరోపించారు. కేజీ తరగతుల పేరుతో నిర్వహిస్తున్న కార్పొరేట్ పాఠశాలలకు చట్టబద్ధత ఇచ్చినట్లేనని విమర్శించారు. కేంద్రం తెస్తున్న నూతన విద్యావిధానం తెలంగాణ రాష్ట్రంలో అమలుకాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అధ్యక్షులు కే.జంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్‌సిఈఆర్‌టీ పుస్తకాలలో చరిత్రకు సంబంధించిన పాఠ్యాంశాలను తొలగిస్తూ మతపరమైన అంశాలను చొప్పించటం వల్ల దేశ మౌలిక సూత్రాలకు భంగం కలిగే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ తక్షణమే పేరివిజన్ కమీషన్‌ను ఏర్పాటుచేసి, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళనలు నివారించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డిఏలను వెంటనే మంజూరు చేయాలని, పదోన్నతులు, బదిలీలకు సంబంధించి కోర్టులో ఉన్న స్టేను ఖాళీ చేయించటానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. పీఎఫ్ఆర్‌డిఏ చట్టాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానంపై మరో ప్రత్యామ్నాయం అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు దుర్గాభవాని, టి.లక్ష్మారెడ్డి, పి.మాణిక్‌రెడ్డి, ఎం.రాజశేఖర్‌రెడ్డి, డి.సత్యానంద్, జి.నాగమణి, ఈ.గాలయ్య, బి.రాజు, కే.రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జిగా మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా మర్రి రాజశేఖర్ రెడ్డిని నియమించి నట్లు బిఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రకటించారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న గత రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన సీట్ ఖాళీ కావడంతో నియోజకవర్గం అభివృద్ధి, పార్టీ కార్యకలాపాలు, ఆత్మీయ సమ్మేళనాలు, పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిని కంటోన్మెంట్ ఇన్‌ఛార్జిగా నియమించారు. అదే విధంగా గోషామహల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నందికి షోర్ వ్యాస్ బిలాల్, భద్రాచలం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా మాలోత్ కవితలను నియమించినట్లు బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం ప్రకటించింది.

## పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి



1వ వార్డు పెన్షన్‌లైన్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న జంపనప్రతాప్

కంటోన్మెంట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. శనివారం రాత్రి బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్‌లో మీర్జా అక్తర్ అస్లమ్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు జంపన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. కులం, మతం వర్గ విబేదాలు లేకుండా అందరు సోదర భావంతో పండుగలు జరుపుకోవాలన్నారు. ముస్లింలకు రంజాన్ అత్యంత ప్రీతిక రమైన పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు అజ్మత్, జావేద్, ఖలీమ్, షకీబ్, అజయ్, షిరాజ్, పహాద్, షాజీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరానగర్‌లో ఇంటింటికి తెలుగుదేశం



కరపత్రాన్ని అందిస్తున్న నేతలు

అల్వాల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: ఇంటింటికి తెలుగుదేశం కార్యక్ర మం ఆదివారం వెంకటాపురం డివిజన్‌లో చేపట్టడం జరిగింది. మల్కాజిగిరి నియోజకవర్గం కోఆర్డినేటర్ సంతోష్ సాగర్ ఆధ్వర్యంలో మూడు గుళ్ల నుంచి పాదయాత్ర ప్రారంభించిన నేతలు ఇంటింటికి వెళుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నగర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు, మహిళలకు బోట్టు పెట్టి పార్టీని ఆదరించాలని కోరారు. తెలుగు దేశం ప్రభుత్వం హాయంలో తమకు అందించిన సంక్షేమ ఫలా లను పలువురు మహిళలు ఈ సందర్భంగా నేతలకు వివరించడం విశేషం. పార్టీ పట్ల ప్రజలులో మంచి స్పందన ఉందని సంతోష్ సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు జిల్లా శంకర్ గుప్త బత్తి నర్సింహగౌడ్, చింతల నరేష్ ముదిరాజ్ లావణ్య సంతోష్ సాగర్ పితాని సత్యనారాయణ పాషా నవీన్ ప్రియాంక సులోచన కవిత రాధ తదితరులు పాల్గొన్నారు.

## సత్కారాలు, పురస్కారాలు ప్రోత్సాహాన్ని అందిస్తాయి : ఉప్పలశ్రీనివాసగుప్త



పురస్కారాలను అందిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: సత్కారాలు, పురస్కారాలు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తాయని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ప్రముఖ వేదపండి తులు, పురోహితులు కెవిఎస్.శర్మకు 'ఉగాది పురస్కారం', వైదిక పురోహిత రత్న' బిరుదు ప్రదానోత్సవ కార్యక్రమం జరి గింది. పురస్కారాన్ని అందించిన అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖు లను పురస్కారాలను ఒకేవేదికపై సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జడ్జ్ బూర్గుల మధుసూదన్, రూపా సుధాకర్‌రెడ్డి, దాసరి రమ్య, లంక లక్ష్మీనారాయణ, నిర్వాహకులు జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు నాయకులు




అప్జల్‌గంజ్, ఏప్రిల్ 9ప్రభాతవార్త: రంజాన్ మాసాన్ని పురస్కరిం చుకుని నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంతోపాటు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు, నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్,బండి రమేష్, ప్రదీప్‌కుమార్‌అగర్వాల్, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లీం సోదరులు భక్తి శ్రద్దలతో ఉపవాసలు పాటించడం సంతోదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆదర్శనగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు పి.మమత సంతోష్‌గుప్తను కోఠి మహిళా యూనివర్సిటి వైస్ చాన్సలర్ డాక్టర్ విజ్జులత శాలువ కప్పి సన్మానించారు.

## సమ్మక్క-సారక్కలను దర్శించుకున్న బండ్లగూడ ప్రజా ప్రతినిధులు



మేడారంలోని సమ్మక్క-సారక్కలను దర్శించుకున్న బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పాలకవర్గసభ్యులు

నార్సింగి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పాలకవర్గ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం మేడారంలోని సమ్మక్క-సారక్క అమ్మవార్లను దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడేలా ఆశీర్వదించాలని మహిమాన్విత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశామని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి నాలుగోసారి జననేత ప్రకాశ్‌గౌడ్ భారీ మెజారిటీ తో గెలుపొందేలా ఆశీర్వదించాలని కోరుకున్నట్లు వివరిం చారు. సకాలంలో వర్షాలు కురిసి, జలాశయాలన్నీ నిండాలని, పంటలు బాగా పండి అన్నదాతలు ఆనందంగా ఉండేలా చూడాలని మొక్కులు సమర్పించామని మేయర్ మహేందర్‌గౌడ్ తెలిపారు. సమ్మక్క-సారక్కలను దర్శించుకున్న వారిలో హైదర్షాకోట్ సహకార సంఘం చైర్మన్ రామ్‌దాస్ ముదిరాజ్, బిఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, నాయకులు పాండు, సుమన్‌గౌడ్, వెంకటేష్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## 11న రాష్ట్ర ప్రభుత్వపరంగా మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాలు



మీడియా సమావేశంలో పాల్గొన్న పూలే జయంతి ఉత్సవకమిటీ చైర్మన్లు కె.శ్రీనివాస్,, జి.అంజి, సి.పాండు, మురళీకృష్ణ, వైస్‌చైర్మన్లు

రవీంద్రభారతి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11 మంగళవారం సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతి ఉత్సవాలను ప్రభుత్వపరంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్లు కుల్కచర్ల శ్రీనివాస్, జిల్లపల్లి అంజి, చిందం పాండు, మురళీకృష్ణలు ఆదివారం మధ్యాహ్నం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశదీకరిస్తూ రాజకీయ పార్టీలకు అతీతంగా అందరు ప్రజాప్రతినిధులు, బలహీనవర్గాలు, కుల సంఘాలు పాల్గొని విజ యవంతం చేయాలని కోరారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా 11న జ్యోతిబాపూలే 197వ జయంతి ఉత్సవాలను ప్రభుత్వపరంగా వైభవంగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్లు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన విద్యాప్రదాత, సామాజిక సంఘ సంస్కర్త మహాత్మ పూలే జయంతి ఉత్సవాలను 11 మంగళవారం ఉదయం 10గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో పెద్దయెత్తున ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు టి.విక్రమ్‌గౌడ్, కె.కూ ర్మాచలం, ఆర్.నరేష్, వి.రామకృష్ణ, జి.మహేష్‌యాదవ్, పి.సతీష్, అనంతయ్య, జి.భాస్కర్, పి.విజయ్, వి.మధు, బి.రాజు, ఎం.రాజేందర్, మధుసూదన్‌రావు, నరసింహనాయక్ పాల్గొన్నారు.

## టివి ఆర్టిస్ట్ యూనియన్‌కి సహాయ సహకారాలు అందిస్తా




మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన తెలంగాణ మూవీ అండ్ టివి ఆర్టిస్ట్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న రైజ్ ఫౌండేషన్ ఇండియా చైర్మన్ డాక్టర్.పద్మవీరపనేని

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : తెలంగాణ మూవీ అండ్ టీవి ఆర్టిస్ట్ యూనియన్ సర్వసభ్య సమావేశం చాలా ఆహ్లాదకరంగా 9న ఆదివారం స్థానిక మోతీనగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో గౌరవ అతిధిగా రైజ్ ఫౌండేషన్ ఇండియా చైర్మన్ డాక్టర్.పద్మ వీరపనేని హాజరు అయ్యారు. ముఖ్య అతిధి మాట్లాడుతూ సినిమా వాళ్ళ కష్టాలు తనకు తెలుసు అనీ కోవిడ్ సమయంలో చాలా కష్టాలు అనుభవించారు అనీ, వారు రైజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చాలా కార్యక్రమాలు నిర్వహించామని అలాగే తెలంగాణ మూవీ అండ్ టివి ఆర్టిస్ట్ యూనియన్‌కి కూడా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని 24బై7టియమ్ టిఎయు యూనియన్ సభ్యులకు హెల్త్ పరంగా అందుబాటులో ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ మూవీ అండ్ టివి ఆర్టిస్ట్ యూనియన్ ఫౌండర్ అధ్యక్షుడు సి.యస్.సుందర్, అధ్యక్షులు ఏ.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనువాస్, ఆల్‌కమిటి చైర్మన్ నందూరి రాము, గౌరవ అధ్యక్షులు 30ఇయర్స్ పృధ్వి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రాథోడ్, పద్మారేఖ వర్కింగ్ ప్రెసిడెంట్ మునీంద్ర బాబు, ట్రెజరర్ నూకరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.పి రెడ్డి, జాయింట్ సెక్రటరీలు కనకదుర్గమ్మ, వీరేస్, కార్యవర్గ సభ్యులు మాధురి, అల్లాడ అరుణ, స్వప్న, కావేరి, రవిందర్, వాలి సత్యప్రకాష్, ఎస్.ఆర్.ఎస్ ప్రసాద్, రామ్మోహన్, ప్రేమ్ జీవన్, ఎమ్.శ్రీనివాసరావు, ర్యాలీ మోహన్ రావు, సంజీవరావు, సౌదామిని యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. యూనియన్ సమావేశంలో పాల్గొన్న సభ్యులకు, అతిధులకు యూనియన్ కమిటి వారు ధన్యవాదాలు తెలియజేశారు.

## ముషీరాబాద్‌ను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌దే

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ధర్నాచౌక్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గంను గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పష్టం చేశారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఎస్ఎల్ఎన్ ఎస్ ఫంక్షన్‌హాల్ నందు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదర్శకాలనీలో 35 సంవత్స రాలుగా నెలకొని ఉన్న కచ్చానాలా సమస్యను శాశ్వతం గా పరిష్క రించామని, అదే విధంగా నాగమయకుంట, పద్మా కాలనీలకు ఉన్న వరదనీటి సమస్యను కోట్ల రూపాయల వ్యయంతో నాలాల పున ర్నిర్మాణం ద్వారా పరిష్కరించామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యర్తల బలంతో ఒక తిరుగులేని పార్టీగా మారిందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఘనవిజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాంనగర్ కార్పోరేటర్ వి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాను రాంనగర్ డివిజన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, కానీ కొంతమంది స్వార్ధపరుల కుట్రలతో తాను ఓటమి పాలయ్యానని ఆరోపించారు. భేధాభిప్రాయాలను పక్కకుపెట్టి కార్యకర్తలు, నాయకులు అందరం ఐక్యంగా బీఆర్ఎస్‌ను మరింత బలమైన శక్తిగా మలుచుకుందామని పిలుపునిచ్చారు. ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు కే.నర్సింగ్ ప్రసాద్, మాజీ అధ్యక్షులు అజయ్ ముది రాజ్‌ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్‌లు ముఠా పద్మానరేష్, టి.రవీందర్, యువనేత ముఠా జైసింహా, స్థానిక నాయకులు టి.సోమన్, ఎడ్ల హరిబాబు యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఆకుల అరుణ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, దీన్‌ద యాళ్‌రెడ్డి, శివముదిరాజ్, భిక్షపతి యాదవ్, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ విషయాలలో నూతన ఆవిష్కరణలు చేశారు

**జాతీయ సమాచార పూర్వ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్**

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: ప్రజాపక్ష న్యాయమూర్తి జస్టిస్ చిన్నప్పరెడ్డి అని జాతీయ సమాచార పూర్వ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. గొప్ప న్యాయనిపుణులుగా ఉంటూ న్యాయ వ్యవస్థలోపల ఉంటూ ప్రజల హక్కుల కోసం నిలిచిన ధైర్యశాలి అని అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజాపక్ష న్యాయమూర్తి జస్టిస్ ఓ.చిన్నప్పరెడ్డి శతజయంతి సభ డాక్టర్ వై.సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ దేశంలో అన్ని న్యాయస్థానాల్లో దశాబ్దాలకాలం పాటు ఎక్కడ పని చేసినా కూడా ప్రజల గొంతుగా ఉన్నారని, ప్రపంచ న్యాయ సిద్ధాంతాలకు, శ్రామిక ప్రజల కోణంలో భాష్యాలు రాశారని, ఎన్నో చారిత్రాత్మక తీర్పులిచ్చారని, మరెన్నో తీర్పులకు వివరణలు రాశారని, ఉపన్యాసాలు, చూపిన ఆచరణ, కరకుతనం మనముందు న్నాయని అన్నారు. తాను నమ్మిన భావాలను నిర్మొహమాటంగా వ్యక్తంచేసేవారని, దేశంలో సోషలిజం సాధించబడాలన్న ఆకాంక్షను అనేక సందర్భాల్లో మరికొందరు ప్రజాపక్ష న్యాయమూర్తులతో కలిసి పనిచేశారన్నారు. జస్టిస్ చిన్నప్పరెడ్డి ఇచ్చిన వందలాది తీర్పు లు, ఉపన్యాసాలు పెద్దగ్రంథాలే అవుతాయని కాకతీయ విశ్వవి ద్యాలయం విశ్రాంత ఎకనామిక్స్ ప్రొఫెసర్ ఆచార్య తోట జ్యోతీరాణి అన్నారు. ప్రపంచంలోనూ, దేశంలోనూ జరిగే న్యాయమైన పోరాటాలకు తనవంతు సంఘీభావాన్ని అందించారని అన్నారు. సామ్యవాద సమాజం ఆయన ఆకాంక్ష అని, ఆయన సామాజిక న్యాయ విషయాలలో నూతన ఆవిష్కరణలు చేశారని, న్యాయమూర్తి గానే ఉంటూనే ఎలాంటి సంకోచాలు లేకుండా ప్రజల కోసం, సమాజ ప్రగతికోసం, ప్రజాతంత్ర భావాల కోసం ధైర్యంగా నిలబడ్డా రన్నారు. జస్టిస్ చిన్నప్పరెడ్డి ఆశయాలను ఈతరం విద్యార్థులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ వై.సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నప్పరెడ్డి లాంటి న్యాయనిపుణులు, శ్రామికవర్గ దృక్పథమున్న మేధావుల ఆశయా లను, భావాలను ప్రచారం చేయడంలో భాగంగా ఆయన రచనలు తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తుందన్నారు. ఆయన రచనలను ట్రస్ట్‌గా ముందు ఆంగ్లంలో, తర్వాత తెలుగులో ప్రచురించడం జరిగిందన్నారు. సీనియర్ న్యాయవాది ఎన్.సైదా రావు, స్త్రీ సంఘటన ఎడిటర్ ఎం.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా నందకిషోర్‌వ్యాస్




గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా నియ మితులైన నందకిషోర్‌వ్యాస్(బిలాల్)ను సన్మానిస్తున్న దృశ్యం

గోషామహల్, ఏప్రిల్ 9ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా సీనియర్ నాయకులు నందకిషోర్‌వ్యాస్‌ను (బిలాల్) నియమితులయ్యారు. నియోజకవర్గంపార్టీ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్‌పార్టీ అధిష్టానం ముఖ్యమంత్రి కెసిఆర్,రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి కెటిఆర్ తనపై ఎంతో నమ్మకం ఉంచి నియోజకవర్గం పార్టీ బాధ్యతలను అప్పగించడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వాడవాడలా విస్తరించడంతోపాటు ఇంటింటికి తిరిగి ప్రచారంచేసి ఆయా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తానన్నారు.తనకు ఈపదవి దక్కేందుకు కృషి చేసి మంత్రులు మహముద్‌అలీ తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లకు అభినందనలు తెలిపారు. కాగా పార్టీకార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బేగంబజార్ డివిజన్ బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ పూజావ్యాస్, బిఆర్ఎస్ నాయకులు పరమేశ్వరి సింగ్, పి.సంతోష్‌గుప్త, ఎస్.ధన్‌రాజ్‌మాదిగ,కె.శ్రీనివాస్ గౌడ్, శైలేందర్ కురుమ,అలపురుషోత్తం, నరేందర్‌యాదవ్,లత వందలాది మంది పాల్గొన్నారు.అనంతరం పార్టీ కార్యాల యం ముందు టపాసులు కాల్చి మిఠాయిలను పంచిపెట్టారు.

## ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : సురేష్‌గౌడ్



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ పరీక్షించుకుంటున్న బిఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్

నార్సింగి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం బండ్లగూడ కార్పోరేషన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ కార్యక్రమానికి వెళ్లిన సురేష్‌గౌడ్ తను కూడా ప్రజలతో కలిసి బీపీని పరీక్షించు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ ప్రజలంతా బలవర్ధకమైన ఆహా ర పదార్థాలు తీసుకోవాలని సూచించారు. రసాయనాలతో కాకుండా సేంద్రీయ ఎరువుల తో పండించిన ఆహార ధాన్యాలు తీసుకోవడంతో పాటు రోజూ గంట సమయం వ్యాయామం, కసరత్తు, ఆసనాలు, యోగ, ప్రాణాయామం, ధ్యానంలకు కేటాయించాలని సూచించారు. ఆందోళన, ఆవేశం మనలను రోగాలపాలు చేస్తాయని, ఏది జరిగినా మన మంచికేనని భావించాలని తెలిపారు. ఆదాయం కన్నా ఆరోగ్యం ముఖ్యమన్న వాస్తవంను అందరూ గుర్తుంచుకొని ఆరోగ్య సంరక్షణ కోసం శ్రద్ధ వహించాలని సురేష్‌గౌడ్ వివరించారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలందరికి పరీక్షలు, మందులు ఉచితంగానే అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ పవన్, సంతోష్, ఆర్తి, ఫరీద్, విజత, శ్రీనివాస్‌లతో పాటు స్థానికులు సుధాకర్, నరేందర్, శివరామిరెడ్డి, వెంకట్‌రాములు, ఆనందరెడ్డి, హరీష్, వైష్ణవి, శ్రావణి, కామేశ్వర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

## భాషాపండితుల ఉన్నతీకరణ త్వరలో జరుగుతుంది



నూతన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌ను సన్మానించిన భాషా పండితులు

సైఫాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో భాషా పండితుల ఉన్నతీకరణ త్వరలో జరుగుతుందని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకర్ తెలిపారు. పండితుల వద్ద నూతన పం డితులు శిక్షణ పొంది పాండిత్యాన్ని సాధించాలని పూర్వ కవులైన సినారే, కాళోజి, శ్రీశ్రీ, పోతన, పాల్కురికి సోమనాథుడు మొదలైనవారు వారి వారి స్థాయిలో కవిత్వం రాయడానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్‌లో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన పరిషత్ అధ్యక్షుడు ఎం.డి.అబ్దుల్లా మాట్లాడుతూ కోర్టుల్లో ఉన్న చిన్న, చిన్న సమస్యలు పరిష్కరించబడి త్వరలో భాషా పండితులు పదోన్నతులు పొందడం ఖాయమని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం పండితుల సమస్యలు పరిష్కారంలో చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సలహా దారు పల్లాటి కొండయ్య, నాయకులు కాంతి కృష్ణ, హామీద్‌ఖాన్, మీనాకుమారి, దేవేందర్, డా.ఎస్.విజయ్‌భాస్కర్, బాల్‌రెడ్డి, జమీల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## హిందీ ప్రచార సభ జనరల్ సెక్రెటరీగా షేక్ గైబువల్లీ



షేక్ గైబువల్లీని సత్కరిస్తున్న పండితులు

సైఫాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: హిందీ ప్రచార సభ జనరల్ సెక్రటరీగా షేక్ గైబువల్లీ ఏకగ్రీవంగా ఎన్నిక హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర సంచాలన వార్షికోత్సవ సమావేశం సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని కార్యనిర్వాహక జనరల్ సెక్రటరీ పి.ఫయాజుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హిందీ సేవా సదన్ ప్రారంభించి హిందీ భాషాభివృద్ధికి గత 22 సంవత్సరాలుగా విశేషంగా కృషి చేస్తూ ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ సెక్రటరీగా హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తూ హిందీకి పర్యాదపదంగా తెలుగు రాష్ట్రాలలో భావించే షేక్ గైబువల్లీని హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సురేష్‌పూరి, శృతికాంత్‌భారతి, విజయ్, రామారావు, చక్రపాణి, గోవింద్‌బడిసె, షేక్ హైదర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గుర్తు తెలియని వికలాంగుడు మృతి



బేగంపేట ఏప్రిల్ 9,ప్రభాతవార్త : బేగంపేట పోలీస్‌స్టేషన్ సెక్టార్ 3 పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఒక గుర్తు తెలియని వికలాంగ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సెక్టార్ 3లో కానిస్టేబుల్ జె.ప్రభు,ఎస్‌పీవో రఘు రాంరెడ్డి తో కల్సి పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్నాడు.ఈ సమయంలో డయల్ 100కు ఒక కాల్ వచ్చింది. విద్యుత్ సబ్‌స్టేషన్ కొత్త బ్రిడ్జి వద్ద ఒక గుర్తు తెలియని వికలాంగ వ్యక్తి (40)పడిపోయి ఉన్నాడని సమాచారం అందిందన్నారు.వెంటనే వారు 108కు సమాచారం అందించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అతన్ని పరీక్షించిన అంబులెన్స్ సిబ్బంది అతను మృతి చెందినట్లు తెలియజేసార న్నారు. కానిస్టేబుల్ జె.ప్రభు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని,మృతుడు సుమారు 40సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని, వంటిపై ఎలాంటి దుస్తులు లేవని, వికలాంగుడని, యాచకునిగా భావిస్తున్నామని, ఇతని ఆచూకి తెల్సిన వారు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై జయచందర్ తెలియజేసారు.

## ప్రజాకళలకు పట్టంకట్టిన కానూరి స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: విప్లవ సాంస్కృతికయోధుడు కానూరి వెంకటేశ్వరరావు అని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అరుణోదయ వ్యవస్థాపకులు, ఆదర్శ కమ్యునిస్ట కానూరి వెంకటేశ్వరరావు 8వ వర్ధంతి సభ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పి.వేణు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి రాష్ట్ర నేత కె.గోవర్ధన్, పివోడబ్ల్యు జాతీయ కన్వీనర్ వి.సంధ్య, పాత్రికేయులు సతీష్‌చందర్, ప్రకృతి వైద్యులు టి.వెంకన్న, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నిర్మల, కానూరి వెంకటేశ్వరరావు కుమార్తె జి.అనూరాధ, అరుణోదయ నగర నాయకులు కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజా కళలను ప్రోత్సహిస్తూ, వాటిని భావితరాలకు తనదైన శైలిలో అందించిన గొప్ప వ్యక్తి కానూరి వెంకటేశ్వరరావు అని అన్నారు. ప్రజాకళలకు పట్టంకట్టిన కానూరి స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. వందేళ్ళ తన జీవితంలో ప్రజా కళలకు, సాహిత్యా నికి పట్టం కట్టడమే కాకుండా వందేళ్ల తన జీవితంలో ప్రజాకళలకు, సాహిత్యానికి పట్టంకట్టడమే కాకుండా ఆదర్శన విప్లవ కమ్యునిస్టుగా ఆయన సృష్టించిన అనేక కళారూపాలు చరిత్రలో ఎప్పటికీ సజీవంగా నిలిచి ఉన్నాయన్నారు. నేడు దేశంలో పాలకులు హిందుత్వం పేరిట ప్రజా కళాకారూపాలపై, రచయితలపై, ఉద్యమకారులపై సాగిస్తున్న ఫాసిస్టుదాడులను, నిర్బంధాన్ని వ్యతిరేకించాలన్నారు. ప్రజాకళలను, సాంస్కృతిని కాపాడుకోవడానికి ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా అరుణోదయ కళాకారులు పాటలను పాడారు.




**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client **MOGULLA PADMA,** W/o. Malipeddi Narayana Reddy, Age 43 years, R/o. H.No. 1-15, Bujillapuram village, Mothkur Mandal, Yadadri-Bhongir District lost the original sale deed bearing Doc.No. 4968/2017 dated 21-09-2017 and link documents Doc.No. 6095/2016 dated 22-09-2016, Doc.No. 21032/2006 dated 27-11-2006, Doc.No. 3598/2004 dated 10-3-2004 Regd. At SRO, Narapalli pertaining to property bearing plot 154, Adm. 200 Sq.yards in Sy.No. 9, 10,11, 16, 20 & 21 Part, situated at Chengicherla village, Ghatkesar Mandal, R.R.District while travelling from her village Bujillapuram to Boduppal by Bus and from Boduppal to Peerzadiguda in an Auto on 29-03-2023, so on behalf of my client, I request the General Public, to handover the said original documents either to me or to my client if any one found it and also warn in general that if anybody misuses the said original documents, they will be prosecuted/ punished under the law of land and my client will be held responsible for any transactions that are done by miscreant and will not be binding on them.

**Sd/- K. PUNYAVATHI**
ADVOCATE
H.No. 2-1-17, Upperpally village,
Rajendra Nagar Mandal,
R.R.District
**Cell No.8464052294**

# ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి : హోంమంత్రి మహమూద్ అలీ



సమావేశంలో ప్రసంగిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

**మలక్‌పేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే ప్రభాకర్, గ్రేటర్ బిఆర్ఎస్ ఇంఛార్జి దాసోజు శ్రవణ్‌లు పేర్కొన్నారు. మలక్‌పేట నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి ఆజం అలీ అధ్యక్షతన అజంపురలోని అజాం ఫంక్షన్ హాల్‌లో మలక్‌పేట, యాకుత్‌పుర, చార్మినార్, చంద్రాయనగుట్ట నియోజకవర్గాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను సిఎం కెసిఆర్ అమలు చేస్తూ దేశంలోనే నెంబర్ వన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ పేరు గాంచారని పేర్కొన్నారు. వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ రైతు బంధు, రైతు భీమా, ఉచిత కరెంటు తదితర కార్యక్రమాలను చేపట్టి రైతులను ఆదుకుంటున్న ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలను నివారించారని పేర్కొన్నారు. ఒకప్పుడు కోనసీమ, ఆంధ్రాకే పరిమితమైన పచ్చదనం ప్రస్తుతం మన రాష్ట్రంలో పంట పొలాలు పచ్చగా దర్శనమిస్తున్నాయన్నారు. సిఎం కెసిఆర్ అన్ని వర్గాల సంక్షేమంకోసం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కెసిఆర్ సారధ్యంలో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. బిఆర్ఎస్‌ను మూడవసారి అధికారంలోకి తీసుకు రావాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. సిఎం కెసిఆర్ రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి నాయకులు, కార్యకర్తలకు ప్రజలకు వివరించాలన్నారు. బిజెపి పార్టీ దేశాన్ని దోచుకుంటుంది తప్ప రాష్ట్రానికి నయా పైసా సహాయం చేయటం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సామ సుందర్‌రెడ్డి, భూమేష్, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సామ స్వప్న, చల్లూరి రఘునందన్‌రెడ్డి, గౌర శశిధర్, సాయ భువనేశ్వరి, తెల్ల మహేష్‌కుమార్, జగన్, మారుతి, లాయఖ్ అలీ, రాధ, సునిత్ పత్తి, బాబురావు, రాముయాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవికాలంలో చలివేంద్రాల ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చాలి : పెండ్యాల


చలివేంద్రాన్ని ప్రారంభించిన పెండ్యాల నర్సింహ

**సరూర్‌నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** వేసవి ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ కోరారు. కార్పొరేషన్‌లోని 8, 26, 27 డివిజన్లలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన స్థానిక కార్పొరేటర్లు పసునూరి బిక్షపతిచారి, కీసర హరినాథ్‌రెడ్డి తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రాలతో దాహంతో అల్లాడే ప్రజలకు ఊరట కలిగించాలని అన్నారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాల్లో ముందుండి స్ఫూర్తిగా నిలవాలని ఆయన సూచించారు. కార్యక్రమాల్లో టివి శ్రీరామమూర్తి, పాలెం నరేందర్‌గౌడ్, విక్రంకుమార్, జనార్ధన్‌చారి, సత్యనారాయణ ముదిరాజ్, లక్ష్మీనారాయణ, కృష్ణ, రాజారాం సింగ్, శ్రీనివాస్, ప్రేమ్‌గౌడ్, సతీష్, సంతోషి ఠాకూర్, రాజు యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు : సామ్యూల్‌బాబు


సమావేశంలో ప్రసంగిస్తున్న పాస్టర్ సామ్యూల్‌బాబు

**మలక్‌పేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** మూసారాంబాగ్ కృష్ణతులసినగర్‌లోని బెతానియా బాప్టిస్టు చర్చిలో చర్చి పాస్టర్ రెవరెండ్ సామ్యూల్‌బాబు ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణాన్ని జయించి పునరుద్దరణ అయ్యారని తద్వారా మానవాళికి నిత్య జీవితాన్ని ప్రసాదించారని అన్నారు. యేసు జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళి జీవితంలో ఆనందం, సంతోషాన్ని నింపిన యేసు జీవితం మార్గదర్శకమన్నారు. ప్రజలు సోదరభావంతో మెలగాలన్నారు. అదేవిధంగా టిఎన్‌జిఓ మహిళాధ్యక్షురాలు రేచల్, షీల దోరతి బైరపోగు, సుధీర్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ కానుకలకు బదులుగా నగదును అందించాలి : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి


ముస్లింలకు కానుకలను అందిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** రంజాన్ పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు సమకూర్చిన కానుకలను హయత్‌నగర్‌లోని హయత్‌భక్షీ మసీదులో ఆదివారం కార్పొరేటర్ కళ్లెంనవజీవన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగ సమయంలో ముస్లింలు ఎంతో నిష్టతో ఉపవాసాలు చేస్తారన్నారు. బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ సందర్భంగా పంపిణీ చేస్తున్న బహుమతులు ప్రజలను మభ్యపెట్టేలా ఉన్నాయన్నారు. పైగా వాటిలో నాణ్యత ఉండడం లేదన్నారు. దీనికి బదులుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో నేరుగా నగదును వేయడం వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, ఉగాది ఎల్లప్ప, పాండాల శ్రీధర్, మసీదు కమిటీ ప్రతినిధులు మీర్జాసలీంబేగ్, చాంద్‌పాషా, జహంగీర్, షరీఫ్, రఫిక్ పాల్గొన్నారు.


రంగారెడ్డి జిల్లాలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆదివారం పలువురు మహిళా నాయకురాళ్ళతో కలిసి వెళ్ళి అమ్మవారిని దర్శించుకొని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తూళ్ళ సునీతగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.
(ప్రభాతవార్త, సరూర్‌నగర్)

## వాసవి కాలనీలో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌గుప్తా, ఉపేందర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని బస్టాప్‌వద్ద వాసవి కాలనీ ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిలుగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్త హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఛైర్మెన్ కె.యన్.ఎల్. శ్రీనివాస్ వాసవి కాలనీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గౌరీశెట్టి అరుణ్‌కుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి తమ్మన శ్రీధర్, కోశాధికారి పోవూరి శ్రీహరి రావు కాలనీ సెక్రటరీ అయిత అంజయ్య గుప్త, అష్టలక్ష్మీ దేవాలయం అక్షయ ట్రస్ట్ కార్యదర్శి మాద్యం సుధాకర్ గుప్తా, కాలనీ ప్రతినిధులు చిలుక ఉపేందర్‌రెడ్డి, శుభకర్, కృష్ణమూర్తి, సుజాత, లక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

## కామేశ్వర్‌రావు కాలనీలో రంజాన్ కానుకల పంపిణీ

**సైదాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని లింగోజిగూడ డివిజన్ కామేశ్వర్‌రావు కాలనీలోని మజీదులో రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదివారం మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరమ పవిత్రమైన రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనను పెంపొందించి ఆదర్శవంతమైన జీవితం దిశగా ప్రేరణనిస్తుందన్నారు.

## నిరుపేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం : ఎమ్మెల్యే మైనంపల్లి


విద్యార్థులకు ఆర్థిక సహాయన్ని అందజేస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు

**మల్కాజిగిరి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాలతో మల్కాజిగిరి డివిజన్ విష్ణుపురి ఎక్స్‌టెన్షన్ కాలనీలో ఇద్దరు నిరుపేద విద్యార్థులకోసం యాభై వేల రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఇందులో భాగంగా ఒక విద్యార్థికి 25 వేల రూపాయలు ఫిక్స్ డిపాజిట్ చేసి పాసు బుక్ అందజేశారు. మరో విద్యార్థికి త్వరలోనే 25 వేల రూపాయలసహాయం అందించారని తెలిపారు. కాలనీ అసోసియేషన్‌లో నిరుపేద విద్యార్థుల కోసం ఆర్థిక సహాయం అందించాలని కాలనీ అసోసియేషన్ ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేయడంతో ఎమ్మెల్యే స్పందించి ఆర్థిక సహాయం చేసారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శంకర్రావు, సెక్రటరీ శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు నారాయణరావు, నాగరాజ్, ట్రెజరర్ శర్మ, బాబు నాయక్, రవీందర్, రామారావు, సత్యం, ప్రసాదరావు, అప్పారావు, రాధిక, అన్నపూర్ణ, రామ్‌చందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్‌లో రంజాన్ కానుకల పంపిణీ


రంజాన్ కానుకలు అందజేస్తున్న చింతల అరుణ

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేంద్రనాథ్ యాదవ్ పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను జైపూరికాలనీలోనీ మసీద్‌వద్ద కార్పొరేటర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఫిత్రా జకాత్ దానధర్మాలు చేయాలని అన్నారు.

## అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం

**నేరెడ్‌మెట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని సిబిఎన్ కాలనీలోని వాంబే గృహాల్లో బి.అర్.అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు రూ. 2లక్షల 20వేల చెక్కును ఎంఎస్ఎస్ఓ ఛైర్మన్ డాక్టర్ మైనంపల్లి రోహిత్ కమిటీసభ్యులు రామ్‌చందర్‌కు అందించారు. అనంతరం అయన కాలనీల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎంఎస్ఎస్ఓ అధ్వర్యంలో వాంబే గృహాల్లో ప్రజలు ఎదురు ్కంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ప్రజల సమస్యలను తీర్చడంలో ఎంఎస్ఎస్ఓ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, ఎస్సార్ ప్రసాద్, జిఎన్‌వి సతీష్, గోకుల్ కుమార్, చెన్నారెడ్డి, గోపినాథ్, బాలక్రిష్ణ, గంగాదరి క్రిష్ణ, పి.ఎస్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దు


సమావేశానికి హాజరైన చల్లా, పారిజాత, అమరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీనే నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసిప్రధానకార్యదర్శి, బడంగ్‌పేట్‌కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసికార్యదర్శి, సీనియర్ నాయకుడు యెల్మేటి అమరేందర్ రెడ్డిలు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ తోట జంగారెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం డిసిసి ఉపాధ్యక్షుడు, భాగ్యనగర్ సొసైటీ వైస్ ఛైర్మన్ బంగారు బాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ఆస్తులను, ప్రాణాలను త్యాగం చేసిన చరిత్ర రాహుల్ గాంధీ కుటుంబీకులదనీ అంత గొప్ప నాయకుడు ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఉంటున్న ప్రతి ఒక్కరూ గర్వపడాలని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలంగానే ఉందనీ నాయకులు, కార్యకర్తలు ఎటువంటి నిరుత్సాహానికి గురికావద్దని వారు సూచించారు. పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉంటామనీ ఎలాంటి సమస్యలు ఉన్నా అండగా ఉంటామని వారు స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ రెండు సార్లు ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా వదులుకున్నారనీ అటువంటి నాయకుడిని స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని వారుపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి జడ్పీ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, నాదర్‌గుల్ మాజీ ఎంపిటిసి కందాడి శ్రీరాంరెడ్డి, సీనియర్ నాయకుడు పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, యెలకొండ శ్రీధర్‌రెడ్డి, మర్రి తిరుపతిరెడ్డి, బంగారు శంకర్, బంగారు అయిలయ్య, సుభాన్ యాదవ్, అమృతానాయుడు, తూళ్ళ నరహరిగౌడ్, టేకుల సుధాకర్‌రెడ్డి, తూళ్ళ సునీతగౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## జిల్లెలగూడ పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణ కమిటీ ఏర్పాటు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ గ్రామంలో దాదాపు ఐదు దశాబ్దాల నాటి ప్రధాన పోచమ్మ ఆలయాన్ని పునర్నిర్మించడానికి ఆదివారం గ్రామస్తులు పునర్నిర్మాణ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లెలగూడ అంబేద్కర్ విగ్రహం చౌరస్తానుండి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈ ఆలయాన్ని భవ్యమైన ఆలయంగా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో కొత్తగా పునర్నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన గ్రామ మాజీ ఎంపిటిసి, రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు, సిద్దాల దశరథ, కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సిద్దాల బాలప్ప, మాజీ వార్డు సభ్యుడు సిద్దాల పెద్ద బీరప్ప, గ్రామస్తులు కుంటల సదానంద్ గౌడ్, చల్లా ప్రభాకర్‌రెడ్డి, మల్లెల విజయ భాస్కర్‌రెడ్డి, సప్పిడి జంగారెడ్డి, పోరెడ్డి జంగారెడ్డి తదితరుల సమక్షంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీని ఎన్నిక చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ నూతన అధ్యక్షునిగా కొత్త మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా జిల్లెల దామోదర్‌రెడ్డి, కార్యదర్శిగా మల్లెల నరేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సిద్దాల జగదీశ్, కోశాధికారిగా కానాల కేమాద్రి, సలహాదారులుగా సప్పిడి యాదిరెడ్డి, కొత్త జనార్ధన్‌రెడ్డి, బొబ్బిలి కిరణ్‌గౌడ్, కుంటల వల్లభ్‌రాజ్‌గౌడ్, బొక్క అంజిరెడ్డిలు అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ వారు మాట్లాడుతూ గ్రామ పెద్దల సూచనలు, సలహాల మేరకు ఆలయాన్ని భవ్యమైన దేవాలయంగా నిర్మిస్తామని తెలిపారు.

## యువత ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు అవసరం : మంత్రి చామకూర మల్లారెడ్డి


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో మంత్రి మల్లారెడ్డి, కార్పొరేటర్

**జవహర్‌నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 27వ డివిజన్‌లో నిర్వహించిన జిట్ట క్రికెట్ టోర్నమెంట్‌ను అదివారం చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యువత అరోగ్యంగా, శక్తివంతంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరం అన్నారు. నేటి యాంత్రిక యుగంలో ఇంటికి, ఉద్యోగానికే పరిమితం కాకుండా వారికి ఒక్కరోజైన క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ప్రతి నిత్యం క్రీడల్లో పాల్గొంటే ఎటువంటి రోగాలు దరిచేరవన్నారు. అనంతరం కార్పొరేటర్ శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రీన్ వ్యూ క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన వారికి బహుమతులను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, పలు డివిజన్ల కార్పొరేటర్లు, కో అప్షన్ మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## యేసు జీవితం అందరికీ ఆదర్శం : ప్రభుచరణ్

**మలక్‌పేట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** యేసు జీవితం అందరికీ ఆదర్శమని మూసారాంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి ఫౌండర్, పాస్టర్ ప్రభుచరణ్, చర్చి పాస్టర్ వన్య ఇమ్మాన్యుయేలు పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లోని చర్చిలో వారి ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణాన్ని జయించి పునరుద్దరణ అయ్యారని తెలిపారు. ప్రతిఒక్కరూ ఇతరులపై ప్రేమ, దయాగుణం కలిగి ఉండాలన్నారు. యేసు బోధనలు మంచి నడవడిక గురించి తెలియజేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## శాంతినగర్‌లో ఘనంగా ఈస్టర్ వేడుకలు

**హయత్‌నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు పరిధిలోని శాంతినగర్‌లో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వద్దేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హింసాద్వేశాలను విడనాడి ప్రేమ భావంతో జీవనం సాగించాలని ఏసు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్ ప్రశాంత్, మల్కన్న, శామ్యుల్, ఎల్సరాజు, నాగరాజు, శంకర్, రామచందర్ పాల్గొన్నారు.

## డాక్టర్ బాలరాజునాయుడుకు ఉత్తమ ఆర్థోపెడిక్ డాక్టర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ బాలరాజు నాయుడు

**సైదాబాద్,ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** చంపాపేటలోని ఓనస్‌ఆసుపత్రి ఎండి డాక్టర్ బాలరాజు నాయుడు ఉత్తమ ఆర్థోపెడిక్ డాక్టర్‌గా అవార్డును అందుకున్నారు. యాక్ట్ నౌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేల్లో ఉత్తమ ఆర్థోపెడిక్ డాక్టర్లుగా డాక్టర్ బాలరాజునాయుడు, సిఇఓ డాక్టర్ స్వరూప్, డాక్టర్ కార్తీక్‌లు ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో వీరిని ఘనంగా సన్మానించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలరాజు నాయుడు మాట్లాడుతూ యాక్ట్ నౌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం హెల్త్ అండ్ మెడికల్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకోవడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉంటూ మరింత మెరుగైన వైద్యాన్ని అందిస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి అర్థిక సహాయం : మైనంపల్లి రోహిత్


గాయపడిన వారికి అర్థిక సహాయం అందిస్తున్న డాక్టర్ మైనంపల్లి రోహిత్

**నేరెడ్‌మెట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి ఎంఎస్ఎస్ఓ ఛైర్మన్ డాక్టర్ మైనంపల్లి రోహిత్ అర్థిక సహాయం అందజేసారు. ద్విచక్ర వాహనంపై నుండి పడి గాయాలైన కమలాకర్‌కు 25వేలు, హిమబిందుకు రూ. 25వేలు, అటో బోల్తా ప్రమాదంలో గాయాలపాలైన విష్ణుకు రూ10వేలు, పద్మరాజుకు రూ. 10వేలు, శ్యామ్, శంకర్, మనోజ్, త్రిశూల్, రోహిత్‌లు ఒక్కొక్కరికి రూ. 5వేలను అందించామన్నారు. అనంతరం మాట్లాడుతూ ఎంఎస్ఎస్ఓ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టి నిరుపేదలకు అర్థిక సహాయం అందిస్తూ మానవత్వం చాటుకుంటున్నామన్నారు. తమ సేవాకార్యక్రమాలను నగరంలో విస్తరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిట్ల శ్రీనివాస్, జిఎన్‌వి సతీష్‌కుమార్, సూరి, క్రిష్ణమూర్తి, బాలక్రిష్ణ, ఉపేందర్‌రెడ్డి, ఎస్సార్ ప్రసాద్, సత్తయ్య, సందీప్, జగదీష్‌యాదవ్, అగమయ్య, బాలరాజు, శ్రీను, పిట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ వానరసేన జాతీయ కార్యదర్శిగా గాజుల స్వయం ప్రకాష్ నియామకం


నియామక పత్రం అందుకుంటున్న స్వయం ప్రకాష్

**సైదాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** రాష్ట్రీయ వానర సేన జాతీయ కార్యదర్శిగా లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్క్ కాలనీకి చెందిన గాజుల స్వయం ప్రకాష్ నియమితులయ్యారు. వానర సేన జాతీయ అధ్యక్షుడు ఎన్.రాంరెడ్డి ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వయం ప్రకాష్ మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తూ వానరసేన కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

## రక్తదానం మహాదానం : కొత్త రామారావు



రక్త దానాన్ని ప్రారంభించిన ఛైర్మన్ కొత్త రామారావు

**కుషాయిగూడ, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** రక్తదానం మహాదానం అనే విషయాన్ని గుర్తించి యువత రక్తదానానికి ముందుకు రావాలని కుషాయిగూడ లయన్స్ ఆసుపత్రి చైర్ పర్సన్, ప్రముఖ సంఘ సేవకులు కొత్త రామారావు పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ లయన్స్ ఆసుపత్రిలో సృజన తెలంగాణ తలసేమియా బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి రక్తం ఎంతో అవసరమని రక్తం అవసర ప్రాధాన్యతను గుర్తించి ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. రక్తదానం చేయడం ద్వారా కొత్త రక్తం శరీరంలో ఉత్పత్తి అవుతుందని తద్వారా దానం చేసిన వారు మరింత ఆరోగ్యవంతులు అవుతారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, రవిశంకర్, రాజు, డి.రామచందర్, పురుషోత్తంరావు, గోపి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజలకు సిఎం కెసిఆర్ ప్రభుత్వం కృషి : బొంతు రామ్మోహన్

**కుషాయిగూడ, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు తమ అధినేత కేసిఆర్ ప్రభుత్వం ద్వారానే మేలు జరుగుతుందని నగర మాజీ మేయర్ తెలంగాణ ఉద్యమ నేత బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు. ఈస్టర్ వేడుకలు పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలోని కాలనీలలో ఏర్పాటుచేసిన ఈస్టర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, గంధం నాగేశ్వరరావు, మాజీ డివిజన్ అధ్యక్షులు వంజరి ప్రవీణ్ కరిపే కరుణాకర్ క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.

## దేశ ప్రజల చూపు మోది వైపు: సురేందర్‌రెడ్డి

**సైదాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్రమోదికి భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలంతా నరేంద్రమోది వైపు చూస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారత దేశ ఖ్యాతిని, ప్రతిష్టను పెంచిన మరింత ఘనత నరేంద్రమోదికే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణాలో బిజెపి విజయ కేతనం ఎగురవేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు.